


హోరుహోరుమని ఆవిరి వదుల్తోంది ఇంజను. ప్యాసింజరు కదలటానికి ఇంకా చాలా టైముంది. కంపార్టుమెంటులోంచి బైటకొచ్చాడు సత్యం.

సరిగ్గా అదే సమయానికి ప్రక్క కంపార్టుమెంటు గుమ్మంనుంచి ప్లాట్‌ఫారంమీద కాలు మోపుతున్నాడొక ఎర్ర స్వెట్టర్ మనిషి.

ఆ కదలికనూ ఆ మనిషినీ ఎక్కడో చూసినట్టు అనిపించింది సత్యానికి. నుదురు చిట్లించి చూశాడు. ఆ మనిషి— సుధాకర్!

చప్పున ముఖం చాటుచేసుకోబోయాడు. సత్యం ఆలోపలే—"హలో సత్యం—" అంటూ దగ్గరకొచ్చి చెయ్యి ముందుకు చాపాడు సుధాకర్.

రైలింజన్ హోరుహోరుమంటోంది.

* * *

ఆరేళ్ళక్రితం—

"రాధా !— నిన్ను నేను ప్రేమిస్తున్నాను—"

"సారీ సత్యం కాని_ నా మనసు_"

"రాధా—"

"అప్పుడే వొకరికి అంకితమై పోయింది—"

"ఎవరికి ?—"

"సుధాకర్ కి—"

"పెళ్ళిచేసుకుంటానన్నాడా ? అతణ్ణి గురించి మంచిగా ఎవరూ చెప్పరనుకో కాలేజీలో అయినా "

"ప్లీజ్ సత్యం - ఈ విషయంలో నీ సలహా యేమీ నేను అడగలేదు_"

"సుధాకర్ కి ..ఆఫ్టరాల్ సుధాకర్ కి_"

"సత్యం _"

"ఆ స్కౌండ్రల్ కా నువ్వు మనసిచ్చింది నాకన్నా వాడు ఎందులో ఎక్కువ ?"

"లెస్ టాక్ యూ సత్యం ప్లీజ్ గెటవే...ఆడమనసు నీకు అర్ధంకాదు..."

తల వొంచుకొని వొచ్చేసాడప్పుడు సత్యం. వొంటరిగా వున్నప్పుడు పళ్ళు పటపటా నూరుకున్నాడు పిడికిలి బిగిస్తూ పచార్లు చేశాడు. చివరి కేం చేశాడు ?

రాధ ఖర్మానికి రాధను వొదిలేశాడు.

పోనీలే - ఆ పిల్లయినా సుఖంగా వుండనీ - మనస్సైనవాడినే చేసుకోనీ - అనుకున్నాడు

కాని, జరిగిందేమిటి ?

సుధాకర్ రాధను పెళ్ళాడలేదు. ఆ పిల్లతో తిరిగినన్నాళ్ళు తిరిగాడు. వాళ్ళిద్దరి మధ్యా 'పవిత్ర ప్రేమ' మాత్రమే కాక ఇంకా ఏదో వుందనీ పుకారు వినిపించింది. ఆఖరికి ఆ పిల్లతో స్నేహం తెంచేసుకున్నాడు సుధాకర్. అదేమిటని అడిగినవాళ్ళతో ఏం చెప్పాడు ? "ఆ పిల్ల క్యారెక్టర్ మంచిది కాదు -" అన్నాడు !

వెళ్ళి సుధాకర్ ని తన్నాలనుకున్నాడు సత్యం. అయినా నాకెందుకులే అని ఊరుకున్నాడు. రాధ క్షమించిందో లేదో. సుధాకర్ ని - సత్యం మాత్రం అతనంటే ద్వేషం పెంచుకున్నాడు—

స్టూడెంట్స్ ఛెయిర్మన్ పదవికి సుధాకర్ పోటీచేస్తాడని మొదట్నుంచీ తెలుసు.

"అఁ— వాడా— పిచ్చుక— వూది పారేస్తాను—" అన్నాట్ట సుధాకర్, తన మద్దతుదార్లతో.

సత్యంలో పట్టుదల ఎక్కువయింది.

కేన్వాసింగ్ కార్యక్రమాలు ఇంకా ఉధృతం చేశాడు.

"పుస్తకాల పురుగు - విద్యార్థిసమస్యలంటే యేమిటో సత్యానికేం తెలుసు ? లీడర్ షిప్ క్వాలిటీస్ వాడిదగ్గరేమున్నాయి ?_" అని స్టేజీమీంచి తిట్టాడు కూడా సుధాకర్.

ఎన్నికలు ఉద్రిక్తంగా జరిగాయి. సత్యం థంపింగ్ మెజారిటీతో గెలిచాడు.

కాలేజీ కేంపస్ లో తలెత్తుకోలేక పోయాడు సుధాకర్. నెలరోజులపాటు ఎవరికీ కనిపించకుండా పోయాడు.

తిరిగొచ్చి మళ్ళీ మామూలుగా క్లాసులో హాజరయ్యాడు. అయితే — కాలేజీ విషయాల్లో వీలైనప్పుడల్లా కల్లోలం సృష్టించటం మొదలెట్టాడు. అటు సుధాకర్ అనుచరులూ, ఇటు సత్యం సహచరులూ కూడా ఆ కల్లోలాన్ని ఇంకా ఎక్కువచెయ్యటానికే ప్రయత్నిం చారు.

హాస్టల్ మెస్‌లో మటన్ ప్లేట్ దగ్గర ఒక చిన్నపాటి గొడవ మొదలైంది. అది కాలేజీ రచ్చకెక్కి రభసైంది.

ఇరుపక్షాలవారూ బిలాబిలాలు తేల్చు కొనేదాకా వెళ్ళటంతో వ్యాళ్ళోని 'పెద్ద తలకాయలు' కొన్ని జోక్యం కలగజేసు కొన్నారు.

సెకండ్‌షో సినిమానుంచి వొస్తున్న సత్యాన్ని హాస్టల్ కాంపౌండు కవతల పది పన్నెండుగురు రౌడీలు చితక బాదేశారు.

లేవలేక మూలుగుతున్న సత్యం దగ్గిరికొచ్చి వికటంగా నవ్వాడు సుధాకర్.... "రాజకీయాలంటే వుపన్యాసాలే అనుకున్నావా ఇడియట్! ఈ సుధాకర్ దెబ్బంటే ఏమిటో ఇప్పుడైనా తెలిసిందా?.... జీవితంలో నన్ను మరిచిపోకుండా బాగా తగిలించారు కదూ మా వాళ్ళు?— సో లాంగ్.... బై!..."

ఆ తరువాత సత్యం వారంరోజుల పాటు హాస్పిటల్లో వుండిపోవటం - పోలీసు ఎంక్వయిరీ - సత్యం మనుషులు సుధాకర్‌ని తన్నటానికి వెళ్ళటం - డిసిప్లినరీ యాక్షన్‌గా సుధాకర్‌ని వారం రోజులు సస్పెండ్ చెయ్యటం....

ఎలా జరిగిపోయాయి! అన్నీ ఎంత చకచకా జరిగిపోయాయి! కలలోలా.... ఇంద్రజాలంలా....

సత్యానికి చిక్కని రాధ - సుధాకర్‌ను దక్కించుకోలేని రాధ—

పెద్ద కట్నంపోసి ఫారెన్ రిటర్న్డ్ మొగుణ్ణి కొనుక్కున్నట్టు తెలిసింది!

కాలేజీ దినాల్లోనూ - ఆ తర్వాతా - సత్యం, సుధాకర్ ఎప్పుడూ వొకరికొకరు ఎదురుపడను గూడా లేదు.

వొకరిపేరు చెప్తే మరొకరు మండి పడుతూనే వున్నారు - కాలేజీ ఆఖరి దినాలదాకా కూడా.

మరి ఇప్పుడు—

* * *

"నేనోయ్ సత్యం! - సుధాకర్ని! నన్ను గుర్తుపట్టలేదా?-" రైలింజను హోరు తగ్గింది.

తేరుకుని సుధాకర్‌వేపు చూశాడు సత్యం. హఠాత్తుగా అతనికళ్ళముందున్న ఏదో తెర తొలగిపోయింది.

— "సుధాకర్ని.... అంటే — యూనివర్సిటీలో...." ముందుకు సాచిన చేతితో - నవ్వుతూ అంటున్నాడు సుధాకర్.

సత్యం పెదవులమీదికి నవ్వు చిమ్ము కొచ్చింది. "హలో" అన్నాడు చేయి ముందుకు సాచి....